"నీ దుడ్లు నీ కిచ్చేస్తా! ... నా గొడ్లు నా కిచ్చేయ్! ... వూ! చెప్పు. నీ దుడ్లు నీ మొకాన కొడ్తా! ... నా గొడ్లను నాకు తోలేయ్!''

రెండు భుజాల్ని ఒడిసి రెండు చేతులతో పట్టుకొన్నాడు. మాట రెట్టిస్తూ, మనిషిని అమాంతంగా కుదిపేస్తూ అడుగుతున్నాడు. అతని పిడికిళ్ళలో ఇరుక్కొన్న భుజాలు నలిగి పిండైపోతాయేమో?— అనిపిస్తూ ఉంది. అనుకోకుండా ఎదురైన సంఘటన. తట్టుకొని నిలబడలేక తనకలాడుతూ అతని వంక తేలిపారచూచినాను — బిత్తరగా!

కట్టిన గుడ్డ మాసింది. మాసిన గుడ్డ చీలికలు పేలికలుగా చినిగింది. జుట్టు రేగింది. కండ్లల్లో కసి ఉంది. ఒళ్ళు మసిబారినట్లు దుమ్మునిండింది. మాటల్లో కరకుతన ముంది. చేతుల్లో బలముంది. చూపుల్లో అగ్గి కురుస్తూంది.

అత డెవరో నాకు తెలియదు. నే నెవరో అతనికి

# గొడ్లు

## పులికంటి కృష్ణారెడ్డి




తెలియదు. అయినా, మిడిసి పడుతున్న ఎండలో ఆ చెట్టు క్రింద న న్నొడిసిపట్టి అడుగుతున్నాడు.

నే నేమని బదులు చెప్పాలి?

అదే ఆలోచిస్తూంటే — ఉన్నట్లుండి అతడు నా భుజాల్ని వదలిపెట్టినాడు. 'బ్రతుకుజీవుడా!' అనుకొన్నాను. కాని, అంతలోనే మేక మెడ క్రింది చన్నుల్లాంటి నా చొక్కా కాలర్లని రెండు చేతులతో పట్టుకొన్నాడు. ఆ కాలర్లని వడవేసి నా గొంతుకు బిగిస్తూ "ఊ! ఇస్తావా, లేదా చెప్పు. నీ దుడ్లు నీ కిసిరి పారేస్తా! నా గొడ్లను నాకు తోలేయ్!'' ఉరిమురిమి చూస్తూ, పండ్లు పటపటకొరుకుతూ కాలర్లని నా మెడకు బిగిస్తూ అడుగుతున్నాడు.

ఆ రోజు వాడి చేతిలో నా చావు మూడిందని నిర్ణయించుకొన్నాను.

'నాకేమీ తెలియదు, బాబూ! న న్నొదిలిపెట్టు' అని అడుక్కోవడానికికూడా వోపిక లేదు. అవకాశం అసలే లేదు.

పొద్దు నడిమిట్టన ఉంది. ఎండ చంద్రనిప్పులు చెరుగుతూంది. ప్రక్కన్నే స్వర్ణముఖి. నీళ్ళను

మింగి ఇసుకను నెమరేస్తున్నది. ఆకాశంబుననుండి శంభుని శిరంబందుండి అన్నట్లుగా తారురోడ్డు నుండి మట్టిబాటకు, మట్టిబాటనుండి కాలిబాటకు బస్సు మీద — అటుపై కాలిబాట నుండి ఏటికి కాలి నడక మీద సాగింది నా నడక. అయితే ఆ ఏరు దాటేసరికి దేవుళ్ళే దిగివచ్చినంత పని అయింది.

ఆ ఏట్లో! ... అబ్బబ్బ! ఎర్రని ఎండ. ఎండలో మిలమిలా మెరుస్తూ ఏటి ఇసుక. ఆ ఇసుకలో నడక. గుదికాళ్ళకు, చెప్పులకు మధ్య పడిన ఇసుకరేణువులు కొన్ని పైకెగిరి నాకు అభిషేకం చేస్తుంటే— కొన్ని వేమన్న గారి పద్యాన్ని మతికి తెస్తున్నాయి. ఆ పోరు పడలేక రెండు కాళ్ళల్లోనివి ఒక్క చేతికి తీసుకుంటే పైనా, క్రిందా కాలిపోతూ ఉంది. ఏటి మీది వడగాడ్పులు గూబల్ని అదరగొడుతున్నాయి. కాళ్ళు ఇసుకలో కూరుకుపోతున్నాయి. ఏటిలోనే ప్రాణం ఎగిరిపోతుం దనిపిస్తున్నది. చేజేతుల చేసుకున్న పని అనుభవించక తప్పదు. ఎట్లో ఆ ఏరు దాటితే, వీ డెవడో దాపురించాడు నా ప్రాణానికి కొసురుగా!

బతికినంత బతుకు బదికి కడకు దిక్కులేని చావు చావవలసి వచ్చింది కదా? అని గుండె కుము లుతూ ఉంది. పోనీ — గజేంద్రుడిలా మొరపెట్టు కొన్నా దేవుళ్ళు దిగివచ్చే కాలమా? కాదే!

వూరుకాని వూర్లో దిక్కూ దరీ లేనిచోట నే నొక పసల పోలిగాణ్ణి!

ఈ పోలిగాణ్ణి గురించి ఆలోచించే వాళ్ళెవరు? ఆదుకొనే వాళ్ళెవరు?

నా దీనావస్థ అర్థమైనట్లుగా ఉన్నట్లుండి వాడు నా చొక్కా కాలర్లని వదలిపెట్టినాడు.

పైకెగిరి పోతుందనుకొన్న ప్రాణం పోలేదు.

'ఈ రోజు నిద్రలేచిన వేళ మంచిదే! గండం తప్పింది' అని అనుకొంటూ ఉంటే వాడు నిలువునా కూలబడి నా రెండు కాళ్ళను పొదివి పట్టుకొన్నాడు.

"మా యబ్బతోడు. నీ దుడ్లు నీకు పువ్వుల్లో పెట్టిచ్చేస్తా! నా గొడ్లను నాకు తోలేయ్. నీకు పున్నెం ఉంటుంది."

ఏడుపుతో కలిసి మాటలు. మాటలతో కలిసి యేడుపు. గుండెల్ని చీల్చుకొని వస్తున్నాయి. ఆకు అల్లాడని ఆ ప్రశాంత వాతావరణంలో వాడి ఏడు పుతో గుండె లవిసి పోతున్నాయి. నా ఆశ్చర్యానికి మేరలేదు.

అవస్థలోనుండి ఆశ్చర్యంలోపడి, ఆశ్చర్యంలో నుండి తేరుకొనే సరికి వాడు ఎగిరిపడి పైకిలేచినాడు. నా మొగంలో మొగం పెట్టి 'నిన్ను నమిలేస్తా' నన్నంత తీక్షణంగా చూచినాడు. ఎంతసేపు? ఒక వక్క కొరికినంతసేపు. ఆ తరవాత అమాయకంగా నా వైపు చూస్తూ విరగబడి నవ్వుతున్నాడు.

"వాడెవడో యుదవ నా కొడుకు!— నా గొడ్లను తోలుకపోతే నిన్నడిగితే పాపం! నువ్వేం జేస్తావ్? నే నొక పిచ్చినా కొడికిని" అని అంటూ జుట్టు పీక్కున్నాడు. తల తల కొట్టుకున్నాడు. అంతే ఎట్లా వచ్చినాడో అట్లానే దూసుకుపోతున్నాడు వడిశెల రాయిలాగా!

కయ్యూ కంపా లెక్కపెట్టకుండ కాలికొద్దీ పరుగెత్తుతున్న వాడి వైపు చూస్తూ నిట్టూ రుస్తూ నిలబడినాను.

'పాపం! ఎవడో వాడు—వాడి గొడ్లను ఎవడు తోలుకుపోయినాడో? యేమో?'

ఆ చెట్టు క్రింద నిలబడి ఆలోచిస్తూంటే - వాడి మీద సానుభూతి కంటే నా మీద నాకే యేవగింపు కలుగుతూ ఉంది. లేకుంటే దోవన పోతున్న జగడం ఇంటిదాకా అన్నట్లు నా కెందు కీ గొడవలన్నీ! ...

ఆ రోజు ఉదయం... నిద్ర లేస్తూనే ఒక దిన పత్రిక చేతికి అందుకొన్నాను. చేతికి వచ్చీ రాక మునుపే మొట్టమొదటి పేజీలో పతాక శీర్షికలో కంటపడింది — 'రాయలసీమలో కరవు రక్కసి కరాళనృత్యం' అని.

ఆ మాట మనసులో మెదిలేసరికి ఆ మీదట పత్రిక చదవడానికి కూడా బుద్ధిపుట్టలేదు. ఎవడో నిర్దాక్షిణ్యంగా నా గుండెని పట్టి పిండుతున్న ట్లనిపించింది. పత్రిక మడిచి ప్రక్కన పెట్టినాను. ఆలోచనలకు పగ్గాలు విడిచిపెట్టినాను.

అప్పుడు నాకు గోచీ పెట్టుకునే వయస్సు. ఆ వయస్సులో రాయలసీమలో కరువు వచ్చింది. ఆ నాటి పరిస్థితి బాగా నా లేత గుండెలో ముద్ర పడిపోయింది. ప్రయత్నించి తుడిచినా పోయేది కా దది. అందుకే ఇంకనూ నాకు కండ్లకు కట్టినట్లు కన్పిస్తూంది. వరుసగా నాలుగైదేండ్లు వర్షాలు పడలేదు. చెరువులు ఒళ్ళు ఆరవేసినాయి. బావులు అడుగంటినాయి. ఈ బావులమీద, చెరువులమీదనే రాయలసీమ సేద్యం ఆధారపడింది. ఏ తొలికోడి కూసే వేళకాడనో మోటగట్టి నోరులేని గొడ్లను ఆ బారులో వెనక్కూ, ముందుకు లాగుతూ పాతాళ గంగను బానకు బాన పైకితేస్తే — నోటికి, చేతికి అందడం అంతంతమాత్రం. ఇక వానలే లేకపోతే నీళ్ళెక్కడి నుండి రావాలి? కపిలెక్కడ కట్టాలి? సేద్యం ఎట్లా కొనసాగాలి? పంట లెట్లా పండాలి?

'ఆకహో రామచంద్రా!' అని అల్లాడిపోయినారు జనం. ముంతెడు గంజికోసరం గంజి కేంద్రాల వద్ద పడిగాపులు కాచినారు. 'ఆకలి' అంటే అంత పెట్టడమే కానీ, చేయిచాచి ఎరుగని రైతు బిడ్డలు గంజి కేంద్రాల వద్ద పడిగాపులు కాయలేక అడవుల మీద పడినారు. దేవదారు ఆకు దూసుకుని తెచ్చు కున్నారు. ఆ ఆకు ఉడకబెట్టి తిన్నారు. వెదురు బియ్యం వండుక తిన్నారు. కలబంద గడ్డలతో కడుపులు నింపుకొన్నారు. కొన్ని వూళ్ళకు వూళ్ళే వలసపోయినాయి. పుట్టి పెరిగిన వూరిని, నడయాడిన మట్టిని వదలలేని వాళ్ళు మాత్రం ఈలకరచి నిలబడి నారు. చచ్చినంతమంది చావగా, తప్పించుకొన్నవాళ్ళు ఆయుస్సు గట్టి దనుకొన్నారు.

రాయ లేలిన ఈ సీమలో సంకటి పలిబిండికి నోచుకోని ఈ సీమవాసులు గత వైభవాల నీడల్లో మేడలు కట్టుకొంటున్నారు. ఆ మేడల్లోనే నిగిడి నీలిగి చస్తున్నారు. పుట్టిన తరవాత ఎప్పుడో ఒక ప్పుడు చావడం ఖాయమని కామందులు చూస్తూ వూరకున్నారు.

ఆలోచిస్తూ మేడమెట్లు దిగుతున్నాను.

"వంకాయలు ... బెండకాయలు ... టొమా టాలు ... కూరలు ... ఆకు కూరలు."

## మీ సాహితీ సంపద

నిర్వహణ : మంజుశ్రీ

### గత సంచికలో ఇచ్చిన సాహితీ సంపద సమాధానాలు

1. గదర్ అంటే సాయుధ విప్లవం. 'నేనూ—నా దేశం' అనే పేరుతో వెలువడ్డ దర్శి చెంచయ్య గారి స్వీయ చరిత్ర.
2. కాళహస్తీశ్వర శతకం. ధూర్జటి.
3. కవిత్వతత్వ విచారం.
4. తిక్కన, వేమన, గురజాడ.
5. కొచ్చెర్లకోట రామచంద్ర వేంకటకృష్ణరావు
6. గిడుగు రామమూర్తి, సీతాపతి
7. తాళ్ళపాక అన్నమయ్య
8. జయంతి.
9. రుక్మిణి, సత్యభామ, కాళింది, జాంబవతి, భద్ర, లక్షణ, సుదంత, మిత్రవింద
10. కాసుల పురుషోత్తమకవి

### 20 ప్రశ్నలు

1. తుంబుర—నారదుల సంగీత విద్యా స్పర్ధను గూర్చి మన పూర్వ కావ్యంలో ప్రసక్తం? ఆ కావ్యం ఏది?
2. ఢిల్లీ సుల్తాన్ పట్టుకపోతాన్ అని పిచ్చివాడు కేకలేసే నాటకం?
3. పెన్నేటి పాట అనే ఆధునిక ఖండ కావ్య రచయిత?
4. అభినవ పోతన అనే బిరుదుగల ఆధునిక మహా కవి?
5. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అన్న దెవరు?
6. వాత్స్యాయన కామశాస్త్రం తెనిగించిన పండితుడు?
7. ఆంధ్ర సాహిత్య పరిషత్తు నడిపిన పత్రిక!
8. విషాద సారంగధర నాటక రచయిత!
9. 'ఇంక్రెడిబిల్ గాడెస్' అనే తెలుగు నవల రాసిం దెవరు?
10. తన నూరు కథలు ఒక సంపుటిగా తెచ్చిన రచయిత్రి?

**సమాధానాలు వచ్చే సంచికలో**




నవనవ లాడుతున్న కాయకూరల్ని, ఆకు కూరల్ని ... నాలుగు చక్రాల బండిపై కుప్పలు కుప్పలుగా రాసిపోసి — బండిని వీధి ప్రక్కగా నిలబెట్టి, బండి ప్రక్కన తాను నిలబడి—కూర గాయల పేర్లను పేరుపేరునా ఒత్తి పలుకుతూ, సరకు నాణ్యాన్ని మాటల్లో చిలుకుతూ కూర గాయ లమ్ముతున్నాడు ఒక వ్యక్తి.

మేడమెట్లు దిగుతూ అటువైపు చూసినాను

ఆ బండి మీద కూరగాయల్ని ఏరుకుంటున్న జవరాండ్ర చేతివేళ్ళ కంటే అందంగా ఉన్నాయి బెండకాయలు వాళ్ళ ఎదమీద వంపుల్ని ఎత్తి చూపుతున్నట్లున్నాయి నవనవలాడుతున్న వంకాయలు ఉదయకాంతిలో. ఉలిక్కి పడుతున్న బుగ్గలతో పోటీ పడుతున్నాయి టొమాటాలు. చెదిరిన ముంగురు లకు సాదృశ్యంగా ఉన్నాయి ఆకుకూరలు —

చూస్తూ నిలబడినాను.

కరవు రక్కసి కరాళ నృత్యానికి, కంటె దుటి సత్యానికి లంకె కుదరలేదు. అదే ఆలోచిస్తూ ఇంటి లోనికి వెళ్ళినాను. ముఖం కడుక్కుందామని కొళాయి త్రిప్పినాను. జిల్లుమన్న నీళ్ళు పైకెగ జిమ్ము తున్నాయి.

కరవు రక్కసి కరాళనృత్యం నన్ను వెక్కిరించింది.

ఇంటి ముందర కూరగాయలు, ఇంటిలో కొళాయి తిప్పితే ఎగజిమ్ముతున్న నీళ్ళు, ఇంటి నుండి అడుగు బయటపెడితే అడుగుకొక్క బారు— బారులో బీరు, బీరు కాకుంటే హోటళ్లో నోరు. సినిమా హాళ్ళ దగ్గర టిక్కెట్ల కొరకై పోరు, క్లబ్బుల్లో నగ్ననృత్యాల జోరు .. ఏది ఆగింది? ఎప్పుడు ఆగింది... ఈ కరువు కోసరమని!

చేతిలో డబ్బుంటే కొండ మీది కోతి దిగి రమ్మంటే వచ్చేరోజు లివి.

పట్టణాల్లో ఏదో విధంగా పొద్దు గూట్లో పడేసరికి చేతిలో డబ్బు పడుతుంది. బతుకు ఏదో విధంగా కొనసాగిపోతూ ఉంటుంది. ఈ మనస్తత్వా నికు వూహాసాధలే వూపిరి. కరువు కాటకాలను గురించి ఆలోచించడానికి తీరిక ఉండదు. కోరిక అసలే ఉండదు— ఎత్రికా ముఖంగా చూసి నోరు చప్పరించడం తప్పితే!

ఈ భావన మనసులో మెదిలేసరికి కరవు రక్కసి వాతపడిన పల్లెప్రాంతాల్ని కండ్లార చూడ వలెనన్న కాంక్ష కలిగింది— ఒక విలేఖరిగా.

ఆ కోరిక ఫలితమే మిడిసి పడుతున్న ఎండలో నేనా మర్రిచెట్టు క్రింద నిలబడడానికి కారణం. ఆ చెట్టు కింద నా అనుభవం పగవాడికైనా వద్దురా, తండ్రీ! అనిపించింది. అప్పటి నా పరి స్థితి నాకే దయనీయంగా కనుపిస్తూ ఉంది. అయినా వృత్తి ధర్మం.

కనుచూపు మేరలో ఒక పూర్వా నాడు కంట పడలేదు. ఆ కాలి దోవ—పొయ్యే కొద్దికీ పొతూనే ఉంది. పోనీ, ఎవరినైనా అడిగి తెలుసుకొంద మంటే పొరాదే పాములే పుట్టల్లో గుట్టుగా ఉండే ఆ ఎండలో మనిషి మసలడం లేదు. ఆ ఎండను వెన్నెలగా భ్రమించి, నగ్నంగా ఆ వెన్నెల్లో విహరించుదామని గుడ్డలు విప్పుకొని గుంపులుగా నిలబడిన వన కన్యల్లా ఆకులు రాల్చి నిలబడిన చెట్లు వేపలు — ఆ ఏటి కిటువైపు అటువైపు తాటిచెట్లు. పారుతున్న ఏటిని దాటడానికని ఒంటి మీద బట్టల్ని విప్పుకొని తలకు చుట్టి నిల బడిన మానవాకారాల్ని తలపింప చేస్తున్నాయి. ఆ ఏటి కల్లంత దూరంలో ఎండిన నెర్రెలు చీలిన జానా బెత్తెడు కయ్యలు. ఆ కయ్యల్లో బట్టతల మీద లేచిపోయిన జుట్టు మాదిరి మలమల మాడి పోయిన పైర్లు. ఏటి ఒడ్డున చాకిరేవు—ఆ రేవులో పగిలిన కుండలు వాడడంలేదని చాటుతున్నాయి—బహుశా ఆ ప్రాంతము ఒక పూరి పాటి మేరగా ఉండవచ్చుననిపిస్తూ ఉంది.

అదే ఆలోచిస్తూ నిలబడినాను.

అంతలోనే ఒక మంద గొడ్లు ఆ చెట్టు నీడను చేరుతున్నాయి. కొన్ని కాళ్ళీడ్చుకొంటూ నడుస్తు న్నాయి. కొన్ని నాలు గడుగులు వేసి నిలబడి పోతున్నాయి. కొన్ని లేగ దూడలు మాత్రం ఒక్క లగువులో వచ్చి ఆ నీడను తెటి కలపడుతున్నాయి.

నా చూపు వాటి మీద పడింది.

ఆ గొడ్లు కళేబరాలై కండ్లల్లోనే ప్రాణం నిలుపు కొన్నట్లున్నాయి. బయట పడిన బద్రెము కలు కరువు రక్కసి కర్కశంగా గోళ్ళతో రక్కిన

గుర్తుల్లా ఉన్నాయి. ఈడ్చుకపోయిన కడుపులు కరవు రక్కసి పాద ఘట్టనతో పడిన పల్లాలవలెదిరి ఉన్నాయి.

తడారిన నా గొంతు పిడచగట్టుకపోతూ ఉంది.

ఒక గొడ్డు మాత్రం పోస్తా ఉంటే మరోకి గొడ్డు ఆప్యాయంగా మూతిపెడుతూ ఉంది.

అంతలోనే టప్‌మన్న శబ్దం నేవిన పడ్డది. అటు తిరిగి చూసినాను. ఒక గువ్వపిల్ల విలవిల్లాడుతూ కింద పడింది. అది క్రింద పడేలోపుగా దాని ప్రాణాలు పైకెగిరి పోయినట్లుంది. తల్లి గువ్వ అరుస్తా తల్లడిల్లి పోతూ ఉంది. తలపైకెత్తి ఆ తల్లి గువ్వ వంక చూసినాను. తల్లి గువ్వది కాకిశోకంగా ఉంది. ఆ కొమ్మల మాటున తలదాచుకొన్న గువ్వలు మెడలు వాలేసి ఇప్పుడో ఇంకా సేపటికో అన్నట్లున్నాయి. చెంగు చెంగున ఎగురుతూ కొమ్మల మీద ఆడుకొనే ఉడతలు గోడమీది బల్లుల్లా కొమ్మలకు అతుక్కున్నాయి.

ఎద్దు మెడమీద కాడిబెట్టి రైతు మేడి పిడిచేత పట్టితే—

ఆకుల మాటున మెడలు వాలేసిన గువ్వలు— మెమ్మల మీద చిందులు!

కొమ్మలకు అతుక్కుపోయిన ఉడతలు— ఒకే వర్తకురాలి మువ్వలు!!

చెట్టుకింద వగరిస్తా పడి ఉన్న పశువులు తల్లిచేతి శిశువులు!!

సకల జీవరాసులు జీవించడానికి కారణభూతుడు రైతుమూర్తి—నేడు నడుములు విరిగి మూల పడినాడు.

"ఏ పూర్ణాయినా పిహది?"

నా ఆలోచనకు అంతరాయం కలిగి తిరిగి చూసినాను.

ఎప్పుడు వచ్చినాడో ఏమో? ఒక పండు ముదుసలి కొంకిదోటి నేల కానించి రెండు చేతుల వెడపుని ఆ దోటికట్టె మీదికి వాలబడి నవ్వాక వింత మనిషిలా చూస్తా అడుగు తున్నాడు. దోటి కట్టెలా వంగిన అతన్ని చూస్తుంటే— కరవు అతని వంటిదమీదనే కాపురం చేస్తున్నట్లుంది. రెప్పార్పకుండా చూస్తూ నిలబడినాను.

"ఏ పూర్ణాయినా అంటే యినిపించుకోకుండా ఏందట్లా ఉండావే? ఏం కనపడ్తా ఉందబ్బా నా దగ్గర?" అమాయకంగా అడుగుతున్నాడు ముదుసలి.

చెప్పకపోతే బాగుండదన్నట్లుగా తోచి చెప్పినాను.

"అయితే నీళ్ళూ విప్పులు దొరకని ఈ మూల కాడు కొంప కెందుకొచ్చినట్లబ్బా?"

"మిమ్మల్ని చూసి పోదామని, తాతా!"

ఆ మాట చెవిని పడుతూనే తాత ఆదోరకంగా చూసి ఇంకొకరకంగా నవ్వుతున్నాడు.

వెన్నెముకను అంటుకొన్న నాభిమండి వెలువడుతున్న దా నవ్వు. ఆక్రోశించే ప్రేవులు చేస్తున్న ఆక్రందనలా ఉం దా నవ్వు! ఎముకల గూటిని వెనుకకు ముందుకు కదిలిస్తున్న దా నవ్వు! అయితే జీవం లేని దా నవ్వు.

"ఎందుకు, తాతా, అట్లా నవ్వుతుండావ్?"

"మణిసి యేడవలేనప్పుడు నవ్వితే ఆ నవ్వు ఇట్లానే ఉంటాది, నాయనా! మమ్మల్ని సూడాలని వచ్చినానంటుండావే — ఏవి సూద్దామని వచ్చినావయ్యా? తాగేదానికి నీళ్ళా? తినే దానికి తిండా? కట్టుకునే దానికి గుడ్డా? లేదు. కంటికింపుగా పైరు పచ్చలా? ఏం ఉండాదని? అద్దో అట్టా జూడు ఎండ—ఆ ఎండ మండినట్లు మండిపోతుండాయే మా బతుకులు. నీడ పట్టున నిమ్మళంగా కూచ్చుంటే కోరింది నడిసొస్తుందే — అట్లాంటోళ్ళ బతుకుల్ని సూడాల్నయ్యా, సూడు. ఏమి సూస్తానో సూడు. ఈ బండ బతుకుల్ని సూడ గలిగినంత సూడు, తండ్రీ! నా మతి మండిపోనూ! ఇంతకుమునుపే ఈ సెట్టుకిందే సూస్తివి కదా, నాయినా, ఒక బతుకును!"

ఆయాసం వచ్చినట్లుగా ఆగినాడు తాత.

"తాతా! తాతా! అదే అడగదామనుకుంటా ఉంటే నువ్వే అన్నావు. ఎవరు, తాతా, వాడు?"

"వాడి బతుకెందుకులే, నాయినా!"

నిట్టూర్చినాడు తాత. నిట్టూరుస్తూ నిలబడ లేకపోయినాడు తాత. నిలబడలేక వెళ్ళి ఆ చెట్టు కింద కూలబడినాడు తాత. కూలబడి చెట్టుబోదెకు వాలబడినాడు తాత.

ఆ పిచ్చోడి కథను విందామన్న కుతూహలం. తాత పక్కన కూర్చున్నాను.






"ఎండన పడొచ్చినావు. పాపం నోరు పిడస గట్టుక పోయ్‌నట్టుందే! గొంతట్ట తడుపుకో, నాయినా!'' చంకలోని సొరకాయ బుర్రను తీసి అందించినాడు తాత.

గుక్కెడు నీళ్ళు!

బతుకులో నీళ్ళ రుచి తెలియనివాడను కాను. అందులో రకరకాల రంగునీళ్ళ రుచి మరిగిన వాడిని. అయినా, ఆ గుక్కెడు నీళ్ళ రుచి! అదొక అనుభూతి.

అందుకే మనస్సులోనే చేతులెత్తి నమస్కరించి నాను, ఆ పల్లె మనస్తత్వానికి—నాగరకత ముసుగులో నలుగుతున్న వాణ్ణి కాబట్టి.

ఆ చెట్టు బోదెకు ఆనుకొన్న తాత రెండు చేతుల్ని వెనక్కు పెట్టి, అరచేతుల్ని జత చేర్చి తలకు ఆపుగా ఉంచుకొన్నాడు. చెట్టుకు చేరగిల బడి కాసేపు అట్లానే శూన్యంలోనికి చూస్తున్నట్లు కూర్చున్నాడు. ఆ పిచ్చోడి ప్రసక్తి తెచ్చేసరికి తాత కూడా తట్టుకోలేక పోతున్నట్లనిపించింది. ఎర్రబారి కన్నీళ్ళు క్రమ్ముకొంటున్న కండ్లను నాకు చూపడం ఇష్టం లేనట్లుగానేమో — కాసేపు మూసుకున్నాడు.

ఎముకల గూడేమి చెప్ప గక్కుతుందో? అనిఎదురు చూస్తూ కూర్చున్నాను.

తాత ఉలిక్కి పడ్డట్టుగా ఈ లోకంలో పడి నాడు. సర్దుకొని కూర్చున్నాడు. సొరకాయ బుర్రచేతి కందుకొని గుక్కెడు నీళ్ళతో గొంతు తడుపుకొన్నాడు. తడిసీ తడవని గొంతును తెమరా యించుకొన్నాడు—నీళ్ళు గొంతు వెంబడి జారడాని కన్నట్లుగా!

నా ఆతురతను కండ్లల్లో నింపి ఆశగా చూస్తున్నాను తాతవైపు.

తాత గ్రహించినట్లుంది.

"అదో! అట్టా జూడు, నాయినా! పరుగు దూరంలో బోడి గుట్ట. కనుపించలా? ఆ బోడి గుట్ట కిందనే సింతసెట్లు. ఆ సెట్ల కిందనే వూరు. పేరంటావా—ఉప్పరపల్లె.''

తాత చూపించిన దిక్కువైపు చూచినాను. మైలున్నర, రెండు మైళ్ళ దూరం ఉండవచ్చు. ఒక బోడి గుట్ట. గుండ్లతో, బండ్లతో నిండుకొని ఉంది. ఆ బండలు మండుతున్న ఎండలో తిరు మల కొండమీది బోడిగుండ్ల మాదిరి మిలమిలా మెరుస్తున్నాయి. ఆ గుట్ట కిందనే ఒక గుంపు చింతసెట్లు. ఆ వూరిని కాపలా కాస్తున్న దెయ్యాల మాదిరి దర్శనమిస్తున్నాయి. అయితే వూరుమాత్రం కనుపించడంలేదు.

"ఆ వూరికి నలభై గడపుంది. కడప కడపకూ అంతో ఇంతో కయ్యాకాల ఉంది. ఆడకోటికి పడగెత్తి నోళ్ళు లేరు. కూటికి లోసై నోళ్ళూ లేరు. ఎవరి రెక్కల కష్టం వాళ్ళది. ఎవరెవరి బతుకులు వాళ్ళోళ్ళవి నాయినా!''

తాత అనుభవంతో పండినాడు. పండిన అను భవం మాటల్లో పడుతూంది. మారు పలక్కుండా వింటూ కూర్చున్నాను.

"మా వూళ్ళో నల్లమోళ్ళంటే, నాలుగు మడ కల సేద్దిగాళ్ళు. నాలుగు రూకలు సేతిలో తిరగతా ఉండే వాళ్ళు. ఒకరి కంత పెట్టే తా నంత తినగలిగి నోళ్ళు. ఆ ఇంట్లో నా కండ్ల ముందర్నే పుట్నాడు నాయినా నర్సిగాడు. వాడు బుద్దెరిగిన నాట్నుండి వాడ్ని బుద్దిని గవనిస్తానే ఉండా. నోరు లేని గొడ్లంటే వాడట్లానే పాణం ఇడిసి పెట్టేసే వోడు.

అదేమి యిచిత్రమో కానీ, నాయినా! అదెట్లాంటి సెగట గొడ్డయినా సరే— బుడంకాయంత బుల్లోడు వాడొరి యాపిమ్మంద కుచ్చుంటే కొమ్ము ట్లాంటూ అనేటివి గాదు. వాడు తోకబట్టే గుంజలాడుంటే కాల టా జాడించేవి కావు. ఆ అలుపు సూసుకోని ఆవల దగ్గిర, మేకల దగ్గిర వా డాడిం దాట! పాడింది పాట!!

ఆవల మంద పోతా ఉంటే అదెవురి ఆవయినాసరే! ఏ ఆవయినా సరే! నిలబెట్టేసే వోడు. ఒంగి పొదుగు దగ్గిర నోరు బెట్టి నోట్నిండుకు పాలు అందుకునేవోడు.

నీకు తెల్సునో తెల్దో కానీ, నాయినా! అడివిలో రేపాళ్ళు అని ఒక జాతి సెట్టుంది. దాని కొయ్య శానా పెళుసుగా ఉంటుంది. కొమ్మల్నుండి పుట్టే రెమ్మలు సెపుగా ఉంటాయి. బొట్నేల్లాసంత రెమ్మెంచుకునే వాడు. ఆ రెమ్మను మెల్లిగా సదేసి తిప్పుతావుంటే— దానిపై బెరుడు బుర్రమాదిర యేరేగా వచ్చేస్తుంది. ఆ బుర్ర తాతపట్టుకున్నాడంటే ఎక్కడ మేక కంట్లో పడితే అక్కడే నిలబెట్టి ఆ బుర్రనిండికి పాలు పిండుకునే వోడు. నాయినా పాలకు రేపాళ్ళ పాలు తగిలిందంటే ఎంటనే జున్ను మాదిర పేరక పోతింది. ఆ బుర్ర ఒక కొన నోట్లో పెట్టుకొని కొసిరి కొసిరి జుర్రుకునేవోడు.

సిన్నప్పుడు వాడి సిలిపిసేష్టలన్నీ ఇన్నీ కాదులే. ఈ సెట్టుకింద కుచ్చోని సందేళదాక సెప్పుకుంటా ఉండచ్చు. నల్లమోళ్ళ నర్సిగాడంటే గోపాల కిష్టుడనే వోళ్ళు వూళ్లో వాళ్ళంతా!

ఆటాంటోడికి ఒక జత కోడెదూడల్ని మేపాలని మనాస పడింది, నాయినా! వాళ్ళకేమి? లేనోళ్ళ పంగతేమో కానీ, ఉన్నోళ్ళ తల్సుకుంటే తాళలేరు. లేడికి లేసిందే పరుగన్నట్టుగా పరవట పలనేరు పర్సకు పోయ్‌నారు. జోడు కోడెల్ని పట్టకచ్చినారు. వాడెమ్మను గొట్ట ఒకదాన్ని సూసిన ట్టుం కొకటి. సూసేదానికి కండ్లే సాలవు, నాయినా! ఒక్క అమ్మ కడుపులోనుండి ఒలస వచ్చినట్టుండేవి!

అసలే వాడికి పసువులంటే ప్రాణం. పరవలో ఏరికోరినక కలేసిన గిత్తలు. కొమ్ములు సివ్వినాడు. కుప్పులు తొడిగినాడు. కుప్పులకు కుచ్చులు కట్టి నాడు. నడుముకు నల్లెంటిక దారం కట్నాడు. మెడ పట్టే శ్లేసినాడు. మూతికి ముక్కు జిమ్మరాలు తగిలించినాడు.

అప్పటికే వా డిద్దరి బిడ్డల తండ్రి. అంతే కూడా యే పొద్దన్నా పెండ్లాం సిగ సిక్కు తీసిందా? సిక్కుదీసిన సిగలో సెండు మల్లెలు తురిమిందా? అని తల్సిన పాపాన పొయ్యుండడు.

మల్లె పూలంటే మతి కొస్తే ఉండాది కురు కురు మాసిలొచ్చే పయాన మా యాడది కడుపుతో ఉండి మల్లె పూల మీద మోజు పడింది. నువ్వు నిజంజెప్పినా యింటావు. అపద్దం జెప్పినా యింటావు వబ్బోడా! ఆమడ దూరం అర గెంటలో నడ్సినాను."

అనుభూతి విభూతి పులుముకొన్నట్టు తాత ముఖం వెలిగిపోతా ఉంది.

కడుపార తాగడానికి దోసెడు నీళ్ళు లేవు. తిన డానికి సిడికెడు కూడు లేదు. ఒంటినిండా గుడ్డలేదు. దినమూ ఆ గొడ్ల వెంబడి ఎండన పడి వరటక పోయిన ఒళ్ళు ... గుంతలు పడిన కళ్ళు ... కరువు కాటకాల వాతపడి నలుగుతున్న బతుకు! అయినా, వలపు తలపుతో ఆ ముసలి ప్రాణం పులకరించి పోవడం—అనుభూతికి మనిషిమీద ఎంత అధికారం ఉందనిపిస్తూ ఉంది.

అదే ఆలోచిస్తున్నాను.

"అబ్బోడా! గొడ్డుబోతోడికి కూడా బిడ్డలంటే తెవు. ఆ మాటకొస్తే నువ్వయినా, నేనయినా ఇట్లా కన్నగసాట్లు పడతా ఉండేది కనుక్కున్న బిడ్డలకోసమే గదా! నర్సిగాడికగ్గాడా ఒక్కరి కిద్దరు బిడ్డలు.

వాడి పాపం గూల! ఆ బిడ్డలి ఉప్పి మిందకంత నవుగుందో? లేదో? అని సూమకుపేవాడో, లేదో కాని పొద్దు మొలిసీ మొలవక ముందే బుడిగ నవురు ఆ గొడ్ల మింద కుమ్మరించి రుద్దుతా కుచ్చునే వోడు.

'ఒరే నర్సిగామ్మా! మా ఎద్దు మంచిది. మా బిడ్డ మంచిది! అని కొమ్మైత్తి ముక్కులో దోపుకుంటే ముక్కు జివిగి పొయ్యిందంట. అట్టాంది గదరా నీ యవ్వారం!' అని దోవన పోతువ్వా కైవురైనా అంటే — ఒక్క వెర్రినవ్వు నవ్వులూ ఎడవ పెయ్యెత్తి కుడి మీసం మీద బెట్టి, కుడిసేతో ఎద్దీపుమ తట్టా—'హా! ఇయ్యాగె వాళ్తే నా సిరంగా! జారిపోవ ద్దంటే!' అనేవాడు.

వాడట్టా అంటా ఉంటే వాడి పెగ్గను పది బండ్ల కెత్తాల్సిందే, నాయినా!

మెడమింద కాడిబెడితే అర్రు పోతుందని కాడి మానికి అంటించెం పూసేవా డనుకో!

వాడే అట్లనుకుంటే — ఆ గొడ్లు కూడా అంతే! వాడు మేపెయ్యాల్సిందే వాడు నీళ్ళు సూపాల్సిందే! వాడు గాట కట్టే తవుడు పెట్టాల్సిందే!

వా డర గెడియ కంటపడకపోతే అరిసి అగడం చేసే వా గొడ్లు.

ఒకసారి ఏమైతేటు. నర్సిమ్ముడికి జరం తగిలింది. కాళ్ళు సేతులు కుక్కలు బీకినట్టు పీకతా వుండాయని వా డట్టా మంచాన పడినాడు. ఇంక జూడు, నాయినా! ఆ గొడ్ల గెలి. ఒకర్ని నగ్గి వట్టా వట్టనిచ్చినాయా? నీళ్ళ మొకం చూసినాయా? గెడ్డి పో గట్టా కొరికినాయా? కొంపలు మునిగినట్టు అవి కట్టు గూటాన వడి కన్నీళ్ళు కారసా వుంటే—ఆదొక యింతమాదిర పూరూ నాదూ ఒకటై చూసింది.

ఆ గొడ్ల గోడు సూడలేకనే మూడో దినాని కంతా ముక్కలా మూలిగతానే లేసి తిరిగినాడు నర్సిమ్ములు.

మనిషికి మనిషికీ మధ్య లేని ఆత్మీయతాను రాగాలు—మనిషికి గొడ్డుకు మధ్య కట్టు కథలాగి తోస్తాంటే—ఆలోచిస్తున్నాను.

తాత దేనికోసమో వెదుకుతున్నట్లుగ అటు ఇటు చూసినాడు. కొంత దోట చేలి కందు కొన్నాడు. ఆ దోట కట్టెను తిప్పించి వీపు గోక్కోడానికి యుత్నిస్తున్నాడు. దురద తీరి నట్టుంది. మర్రి చెట్టువంక ఆశగా చూసి నాడు. అది బుడసకు పేలి ఉంది. లాభం లేదను కొన్నాడేమో? "రావులూ!" అని అరచినాడు.

ఒక్క తరుపు మెరువులా వచ్చి తాత ముందు నిలబడింది—ని న్నాశ్చర్య పరుస్తూ.

తాత వీపు చూపించినాడు. ఆ వీపు మీద చెమట కారి కారి ఎండకు ఉప్పు తేలింది. ఆ వీపును ఆప్యాయంగా నాకుతూ ఉం దా నోరు లేని గొడ్డు. సహించినట్లుగా వీపు నందిస్తు న్నాడు తాత.

ఆ గొడ్డుకున్న గుండెలు—

శక్తి యుక్తుల్ని పెట్టుబడిగా పెట్టి, తెలివి తేటల్ని ధారపోసి పట్టుపీర కట్టించి పోషిస్తుకొని వెంట పడితే—వీపు రుద్దడం నామోషి అనుకునే నా ప్రియురాలికి ఉంటే!...

కోట్లకు కోట్లుగా నిధులు తరుపు పనులకని విడుదల చేస్తుండే ఆ నిధుల్ని మధ్యేమార్గంలో మాయంచేసే మహనీయులకుంటే!...

అలాంటి మహనీయులనైన ఈగ వాలకుండా సంరక్షిస్తున్న సహృదయులకుంటే! నీకుంటే! నాకుంటే!!

"అట్టా పెణానికి పెణంగా సాకతావుంటే ఈ మాయదారి కరు వచ్చిపడింది. ఇంక జూడబ్బోడా వాడిగొనట్టు! కుక్కం కెరిక!"

తాత నైపు చూచినాను. వీపు దురద తీరి నట్టుంది. రావుడు వెళ్ళిపోతున్నాడు. పై తుండు గుడ్డను మెడకెట్టి రెండు చేతులతో రెండు చివరల్ని పట్టుకొని వీపుమీద తడిని రుద్దు కొంటూ చెబుతున్నాడు తాత!

"పెల్లరేకు నాయిగ్గిట్టే వరి కసువు. మద్దేణ వప్పుడు నోటికప్పంగా అయిదారు కట్టల రాగిసొప్ప. నాలుగుబార్ల పొద్దు కాడ కాలడంటి ఎర్రగెడ్డి గనిమలమీంద గెరిక్కసువు. పొద్దుగూకేటప్పుడు బుట్టెడు తవుడూ, గానిగ పిండి. జావ్వలేత్తిరికాడ రెండుమోపుల పచ్చి గడ్డి—యిట్లా తింటావుండిన గొడ్లకు ఈ కరువుకాలంలో ఎట్టా తెచ్చేసే దంత మేపు?

అయినా వాడి లిప్పలోడు వణ్ణాడు. కొన్నంత కొన్నాడు. 'ఈ కరువు కాలంలో మనుసులకు తిండి దొరికేదే వొగ్గందంగా వుంటే—నువ్వు కొంప నరం జేసిగొడ్లకు బెట్టే యింక బలికెదెట్ట?' అని కొంపలో రంపు రగలబడేటప్పటికి, నాయినా! వాడు ఆడికిమింద పడినాడు.

మా వందా రది వుండేదెడ? దగ్గిరదా వాడు వా? తాతి కోడి కూసేయాలకాడ దోసెడు కూట్నీళ్ళు వోట్లో పోసుకొని ఎలబారితే పొద్దిరిగేయాలకు మోపు కసువు దెచ్చేవాడు. ఆ ఒక్క మోపు కసువు ఆ గొడ్లకేడికిసాలిత్తుంది, నాయినా! సాల్లప్పుడు; అట్టా యిట్టా జూసి దొంగిలించడానిగ్గూడ ఎనకాడ లేదు వోడు.

అద్ద! ఈ పొద్దు కురిస్తుంది వాన. రేపు కురిస్తుం దోవ! అని ఆకాశంకల్లా ఎగజూసెగి జూసి యేసారి పోయినావు. ఇంక వానలు కురవ బొయ్యేది లేదు. మణిసీ వుట్టటి బతకబొయ్యేదీ లేదు. గొడ్లకింత మేపు దొరకబొయ్యేదీలేదు. గొడ్డు గోదా కట్టుగూటాన పడి సావాల్సిందే! అనుకునేసరికి కోడె దూడల్ని అమ్మేయాలను కొన్నాడు నర్సిగాడు. 'ఎట్లా తన కసువు లేదు. కసువుండే గాటకైనా పోనీలే!' అని సరిపెట్టు కున్నాడు.

వా డనుకోవడవూ, వూళ్లో ఆ సావి దిగబడడవూ కల్సి మాట్లాడుకున్నట్టు జరిగినాయి.

"కోడెదూడ లమ్ముతావా?" అడిగినా డాసావి.

ఆ ఆసామిని ఎగాదిగా చూసి నాడు నర్సిగాడు.

ఆ ఆసామి ఎనిమిది మూరల మల్లుపంచె సైకిలు కట్టు కట్టినాడు. పంచెకట్టు మింద తెల్లటి అర సొక్కా తొడిగినాడు. సుంగిడిసి తలగుడ్డ సుట్టినాడు. ఏ లేలి కుంగరాలూ... ఎడవసేతి గ్గడియారవూ ... కుడిసేతిలో బెత్తవు... బాగా ఏసులుబాటున్నరైతో, లేకుంటే మారుబేరాల దళారో అనిపిస్తా ఉండాడు.


"ఇస్తాను సూడు" అన్నాడు నర్సిగాడు.


ఆసామి సూసినా డబ్బోడా! కొమ్ము తీరు సూసి నాడు. పల్లు వరస పట్టి సూసినాడు. కాటెక్కుండ్లేవో అని కండ్లు సించుకొని సూసినాడు. సుడీ గిడీ ఉందేవో గెవనించినాడు. మీసం మెలేస్తా, ఎంత అని అడిగినాడు.

బొడ్డేలిని మడిసి అరిసేతిని సూపించినాడు— నర్సిమ్ములు నాలుగేలన్నట్టుగా!

"తీసుకో!" అన్నా డాసామి.

అబ్బోడా! ఆడబిడ్డను సాకి సంతరిస్తావు. సల్లంగా బతకాలని ఎవుడో ఒకడి సేతిలో పెడ్తావు. తీరా ఆ బిడ్డే యిల్లొదిలి పొయ్యేటప్పుడు యిల్లెగిరి పొయ్యేటట్టు యేడుస్తావు. నర్సిమ్ముడి గెతిగూడా






అట్లనే అయ్యింది. మాట జార్నేవో జారేసినాడు. దుడ్లు తీసుకోమనేసరికి వాడి సంగటం దేవుడి కెరిక!

దుడ్లు సూస్తాడు. గొడ్లను సూస్తాడు. ఆసామిని సూస్తాడు. ఎటూ సెప్పలేక సెందలేక,అట్లాయి నై సూస్తాడు. సేతులు నలుపుకుంటాడు. జుట్టు పీక్కుంటాడు. ఎట్లా తోసక ఎర్రిగా సూస్తా నిలబణ డు.

"ఇద్దో -దుడ్లు తీసుకో నెంచుకో!" ఆసామి తొందరపెడ్తా ఉండాడు.

ఆసామి సెయ్యి సాపుతూంటే నర్సిమ్ముడి సెయ్యి ముడుసకపోతా ఉంది. అందుకే పెండ్లాన్నరిసినాడు. ఎందుకో? ఏవో? అనుకోని ఆ యిల్లాలు ఉన్న పళంగా వచ్చి నిలబడితే 'దాని సేతి కిచ్చేయ్!' అని అం ~ మొకం సూపించలేకుండా మొకాన గుడ్డేసు కోని పారిపోయ్నాడు.

యాడేడ తిరిగినాడో? ఎట్టెట్టేడ్సినాడో? తిండీ తిప్పలు లేకుండా తిరిగి తిరిగి ఆ మరనట్నాకు పొద్దుగూట్లో పడే యాళకాడ యింట్లో అడుగు బెట్టి అట్లానే రెప్పార్సకుండా సూస్తా నిలబడి పోయ్నాడు.

గాట్టేండా కసువు. ఆవురావురవి తింటున్న కోడె దూడలు!

వాడి కడుపు నిండిపొయ్యింది.

"ఆసామి కింకా పదిగాండ్ల గొడ్లు కావాలంట! ను వ్వట్లా పోతానే దుడ్లు నా చేతి కిచ్చేసినాడు. సందేళకు బండి కసువు తోలించినాడు. పదిగాండ్లు కొనాలని సాయకట్టుమీద పణ్ణాడు. ఆయరవదాకా మన దూడలి మన గాట్నే కట్టేసుకుం ~నన్నాడు. పెండ్లాం వాడి సందేహాన్ని తొలగించింది.

నర్సిమ్ముడి మణుసు కుదటపడింది.

వారం తిరక్కముందే ఆసామి సాయకట్టంతా కాలికి బలపం కట్టుకోని తిరిగి బాగా కండమీదుండిన పదిగాండ్లను పట్టకచ్చినాడు. సర్సిగా డింటిముందరే గూటార్డించి కట్టేసినాడు.

నర్సిమ్ముణ్ణి పట్టేదానికి పగ్గాలేవు, నాయినా! ఆసలే వోడికి పసువు లంటే పాణం గదా? అవన్నీ తన గొడ్లే అనుకున్నాడు. ఆ గొడ్లకంతా మేపేసేదీ వాడే! నీళ్ళు జూపేదీ వాడే! పేడకళ్ళెత్తేసేదీ వాడే! ఆ వూపులో వాడు గొడ్లను అమ్మేసిన సంగతే మర్సి పోయ్నాడు.

వాడి పిచ్చిలో పడి వాడు కొట్టకపోతా ఉంటే ఒకనాడు బల్లుమని తెల్లారేళకు ఒకలారీ వొచ్చి యింటి ముందర నిలబడింది. ఆ లారీని సూసేసరికి యాడ లేని అక్కర గలిగింది ఆసామి మీద నర్సిమ్ములకి. ఎందుకంటా వబ్బోడా! వాడు కోడెదూడ ల్నిపట్టింది పలవనేరు పర్సలో. పలవనేరంటే పదవాడల దూరం. ఆడనుండి మూడు పొగుళ్ళు మూడు రాత్రిళ్ళు దూడల్ని నడిపించుకోనే ఒచ్చినాడు. ఇప్పు డాసామి అడుగు కింద బెట్టకుండా, గొడ్లకేమాత్రం దెప్పరం లేకుండా లారీమీ దెక్కించి తోలకపోతా ఉంటాడంటే మణిసెంత మంచోడు? అని అనుకున్నాడు. సెయ్యెత్తి దణ్ణాం పెట్టుకుణ్ణాడు. దగ్గిరుండి కోడెదూడల్ని లారీ కెక్కించినాడు.

డ్రైవో రెక్కి కుచ్చున్నాడు.

"అయ్యా! అయ్యా!! ఒక్క నిమిషం నిల బడండయ్యా! నా కడుప దాటిపోతా ఉండే గొడ్లు. ఏ కడుపలో కాలు బెట్తాయెగా? ఏఏవో?ఆ కడుపలో పెంపొంగల్లు! టెంకాయ సుట్టి కొట్టల్ల! ఎర్ర నీళ్ళు దిగిదీసి పొయ్యాల్ల! వస్తానుండయ్యా!! అంటా ఇంట్లోకి పరిగెత్తినాడు నర్సిగుమ్ములు.

గంగాళం ఎత్తుకున్నాడు. దాంట్లో అన్ని నీళ్ళు పోసుకున్నాడు. చిటికెడు పసుప్పొడి రవ్వంత సున్నం ఏసి కలపతా ఉండాడు.

"అంబా!" అని గుండె లవిసి పోయ్యేటట్లు అర్సినాయి కోడెదూడలు. ఆ అరుపుతో ఇంటి కప్పెరిగి పోతుందేవో అనిపించింది. వా డర్సి నా డబ్బోడా! సావరుపరిసినాడు సేతిలో తట్ట సేతిలో ఉండంగానే ఒక్క లగువుతో వచ్చి వాకిట్లో పణ్ణాడు

లారీ ఎలబారి పోతా ఉంది!!

లారీలో వాడి కోడెదూడలు. కుప్పగా కూల బడుతున్నాయి. వాణ్ణి సూస్తే లేవ జూస్తాయి. లెయ్య లేక "అంబా! అంబా!" అని గొంతు చించుకుంటాయి. మల్లా సారా ముందుకు సొస్తే లేసే దానికి మూంపతాయి. లెయ్యలేక కుప్పగా కూలబడ్తాయి. గుండెలవిసేటట్లు 'అంబా' అని అరస్తాయి. మల్లా లేసే దానికి మూంపతాయి. ఎట్లా లేస్తాయి నాయినా? మోకాలి సిప్పలిర గ్గొట్టుండే!

లారీలో ఎక్కిన ఆసామి మణుసులు కొందరా గొడ్లకు మోకాలిసిప్పలిరగ్గొడ్తా ఉంటే, కొందరు కండ్లు పొడిసేస్తా ఉండారు. ఆ లారీలో ఆ గొడ్ల సావుమాపులు ఏమని సెప్పమంటావు, నాయినా? లారి చుట్టూ సేరినోళ్ళు—అయ్యో! అయ్యో!' అంటా ఉండే 'అయ్యో లేదు. గియ్యో లేదు. రే పొద్దస గొంతులు కోసే గొడ్లకు ఇప్పుడు మోకాళ్ళుప్పు తీసేస్తే మునిగిపొయ్యిందే ఉంది? పదండ్రా" అన్నా డా సామి.

లారీ ఆగమేగాల మింద పోతా ఉంది.

ఆ లారీలో నుండి రగతం, నాయినా! పై మొబ్బు సినుకుల్లా పడ్తా ఉంది.

నర్సిమ్ముడి సేతిలో గంగాళం తట్ట జారిపడి పొయ్యింది. వాడు కుప్పగా కూలబడినాడు. 'బారో!' మూ ఏడుస్తా నెత్తురోతో తడిసిన మట్టిని దోసెడు జవురుకున్నాడు. 'ఒరే! నీ యాలితాడు తెగ. నీ నోట్లో ఈ మట్టి పడా! నీ దుడ్లు నీ కిచ్చేస్తా. నా గొడ్లు నా కిచ్చేయ్!' అంటూ ఆ లారీ ఎంట పణ్ణాడు. ఎంత దూర మని పరిగెత్తాడు, నాయినా! యాడనో ఒక పోట బోర్లబొక్కం పడనే పణ్ణాడు. తల దిమ్మదిరిగే టట్లా తెబ్బ తగి లింది. ఆ పొద్దుట్నుంచీ ఇంతే! నీ దుడ్లు నీ కిస్తా! నా గొడ్లు నా కిచ్చేయ్!' అని కనిపిం చిన వాణ్ణంతా అడగతా ఉంటాడు. ఎవరిస్తారు? ఎట్లా ఇస్తారు??"

తాత గొంతు పూడుకపోయింది.

నా మనస్సులో మనస్సు లేదు. నన్నా చెట్టు కింద వదలి అదెప్పుడో ఆ 'పిచ్చోడి' వెంట పడింది. ఎంత ద్వేషించినానో అంత అభిమాని స్తున్నాను వాడిని.

"ఏందో నాయినా! ఆ గొడ్లను మడక్కడతావు. మోట కడ్తావు. పొలాల్లో పంట పండిస్తావు. ఆ పంటను కోసుతింటావు. కొడవకా గొడ్లనూ కోసుకోని తింటావు. పిడికెడు కసువు, కడవ కుడితి నీళ్ళు వాటి మొకాన గొట్టి బతికినప్పుడేవో అట్లా సతాయిస్తావు. సచ్చినాక యిదో ఇట్లా కాళ్ళ కిందేసి తొక్కతావు?"

తాత లేచి నిలబడి కాళ్ళకు చెప్పులు కొడుక్కోవ డానికి యత్నిస్తున్నాడు.

నేను తాత గుండెని అందుకోవడానికి యత్ని స్తున్నాను.

ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. గుండె సమాధాన పడలేదు.

ఎంత ఆపుకొన్నా కన్నీళ్ళు ఆగలేదు! *